
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 17 జూలై 2025



నేరస్థులపై కొరడా..

- ఎఫ్ఐఆర్ నమోదు నుంచి పోలీసుల ప్రత్యేక శ్రద్ధ
- నిందితులకు శిక్ష పడేలా పకడ్బందీగా ఆధారాల సేకరణ
- అవసరమైన రుజువులు, పత్రాలు, వాగ్మూలం కోర్టుకు సమర్పణ
- ఈ యేడాది జిల్లాలో ఇప్పటి వరకు 23 మందికి జీవిత ఖైదు



జగిత్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకూ చిన్న విషయాలకు ఘర్షణ పడడం, ఇతరులపై కక్షలు పెంచుకొని దాడులు చేయడం వంటి నేరాలు పెరుగుతున్నాయి. పలు సందర్భాల్లో మనిషి ప్రాణాలు తీసేవరకు ఆయా అంశాలు దారి తీస్తున్నాయి. ఆయా కేసులకు సంబంధించి నింది తులకు శిక్ష పడేలా ఆధారాలు సేకరించి అభియోగ పత్రాలు దాఖలు చేయడంలో జిల్లా పోలీసులు సక్సెస్ అవుతున్నారు. తక్కువ వ్యవధిలోనే నేరస్థులకు కచ్చితమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో నేరస్థులపై కేసులు నమోదుచేసి, విచారణ చేయడం, అందుకు అవసరమైన పత్రాలు, రుజువులు సేకరించడం, కోర్టుకు సమర్పించడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు 23 మంది నేరస్థులకు జీవిత ఖైదు పడింది.

● ఫిర్యాదు నుంచి కేసు పూర్తయ్యే వరకు..

జిల్లాలో పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మొదలుకొని కేసు పూర్తయి నేరస్థులకు శిక్షపడే వరకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పోలీసు అధికారుల నుంచి కోర్టు కానిస్టేబుల్ వరకు ప్రత్యేకంగా తీసుకుంటున్న జాగ్రత్తలు నేరస్థులకు శిక్ష పడడంలో కీలకపాత్ర వహిస్తున్నాయి. సరియైన పద్ధతిలో కేసు విచారణ కొనసాగించడంతో పాటు, కేసును ఛేదించిన అనంతరం తగిన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. వాటిల్లో ఇటీవల జిల్లాలో అత్యధికకేసుల్లో శిక్షలు పడుతున్నాయి.

● గణనీయంగా పెరుగుతున్న శిక్షలు..

జిల్లాలో ప్రస్తుత యేడాదిలో ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా పలు కేసుల్లో 23మంది నేరస్థులకు జీవిత ఖైదు శిక్ష పడింది. 2022 సంవత్సరంలో ఇదరికి, 2023 సంవత్సరంలో 14 మందికి, 2024 సంవత్సరంలో 10మందికి జీవిత ఖైదు శిక్ష పడింది. 2022 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వివిధ కేసుల్లో 227మందికి శిక్షలు పడ్డాయి. గతంలో కంటే భిన్నంగా ఈ యేడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వివిధ కేసుల్లో 23 మందికి జీవిత ఖైదు శిక్ష పడడం, 25 సంవత్సరాల.. మిగతా 8లో

జిల్లాలో ఈ యేడాది విధించిన శిక్షలు..

- కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి నాలుగు సంవత్సరాలు జైలు, రూ.9,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.
- రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.
- పెగడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు ఐదు సంవత్సరాల జైలు, ఒక్కొక్కరికి రూ.1500 జరిమానా విధించారు.
- ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హత్య కేసులో ఏడుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ ఇటీవల కోర్టు తీర్పునిచ్చింది.
- రాయికల్ మండలం ధర్మాజీపేటలో మద్యం మత్తులో గొడవపడి వ్యక్తి మరణానికి కారణమైన కేసులో ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.
- జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి శివారులో మహిళహత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమానా విధించారు.
- గొల్లపల్లి స్టేషన్ పరిధిలో ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు, రూ.12,200 జరిమానా విధించింది.
- రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.17వేల జరిమానా విధించారు.
- మెట్‌పల్లి మండలం ఆత్మకూరులో భూతగాదాలో అన్నను గాయపరిచిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
-కలెక్టర్ సత్యప్రసాద్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మండలంలోని సిర్పూర్, సాతారం గ్రామాల్లో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంతో పాటు సిర్పూర్ గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, సాతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు వివరాలు, ఉపాధ్యాయులు బోధించే విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్‌లో కూరగాయల మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచనలు చేశారు. చిట్టాపూర్ గ్రామంలో ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు మంజూరైన వారందరూ వెంటనే నిర్మాణాలు చేపట్టాలన్నారు.

ఇళ్ల నిర్మాణంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇండ్ల నిర్మాణ దశలను అనుసరించి వివిధ దశల్లో ప్రభుత్వం లబ్ధిదారులకు డబ్బులను ఖాతాలో జమ చేస్తుందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద రూ.20 లక్షల నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం భవనం, సిర్పూర్ గ్రామ పంచాతీ భవనాలు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ప్లంబింగ్, వాటర్ ట్యాబ్, డోర్స్ వాష్‌రూమ్ పెండింగ్‌లో ఉన్న పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్‌గౌడ్, ఎంపీడీవో శశికుమార్, హౌసింగ్ పీడీ ప్రసాద్, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
●చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జూలై16 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై 4.8కోట్ల రూపాయలతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొడిమ్యాలలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు 10లక్షల రూపాయలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కొడిమ్యాల సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, చొప్పదండి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేష్, మాజీ ఎంపీపీ స్వర్ణలత, ఎంపీడీవో స్వరూప, ఆర్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలని వినతి

కొడిమ్యాలలో ఎస్సీ, ఎస్టీ బాలుర హాస్టల్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త కిరణ్‌కుమార్ బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు వినతి పత్రం అందించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 విద్యాసంవత్సరంకు సంబంధించి బెస్ట్ అవైలబుల్ స్కూల్ యందు గిరిజన విద్యార్థుల ప్రవేశం కోసం ఐదు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో నుంచి 4 సీట్లు లక్కీ ద్వారా ఎంపిక చేయబడినవని, 5వ తరగతి ఎరుకల బాలురకు ఒక సీటు నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుడు ఎస్టీ కుటుంబానికి చెందిన వారై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు తగు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు 8499992214 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

ధర్మపురి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని కోరారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నిర్ణయించిన కొలతల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఏదులాపురం మహేందర్, బండారి మురళి, బొల్లె రమేష్, బొమ్మకంటి పోశమల్లు, జిల్లపెల్లి చంద్రమౌళి, కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి'



మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో రఘువరణ్

ధర్మపురి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని డీఆర్‌డీవో రఘువరణ్ కోరారు. ధర్మపురి మండలంలోని జైనా జడ్పీహెచ్ఎస్ ఆవర ణలో నిర్వహించిన వన మహోత్సవంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలు పెరిగితే పెద్ద వృక్షాలుగా మారి వర్షాలు విస్తారంగా కురుస్తాయని తెలిపారు. పంటలు సమృద్ధిగా పండుతాయని, పచ్చని వాతావరణం కూడా నెలకొంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే గ్రామంలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను పరిశీలించిన ఆయన టార్గెట్ ప్రకారం 6 వేల మొక్కలు నాటాలని అన్నారు. మహిళా సంఘ సభ్యులచే వడ్డీలేని రుణాలు గురించి ఆయన చర్చించారు. తగు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎంపీడీవో రవీందర్, ఈజీఎస్ ఏపీవో సృజన్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్, గ్రామపంచాయితీ కార్యదర్శి సురేష్, హెచ్ఎం చంద్రహరి పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర'



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, జూలై16 (ఆంధ్రజ్యోతి) : బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసే కుట్ర చేస్తోందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల అనంతరం ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిందని ఆమె విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో వసంత బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల వృత్తులను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. అన్ని వర్గాలకు అండగా నిలిచింది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. 20 నెలల పాలనలో బీసీ సామాజిక వర్గానికి చేసిన లబ్ధిని సీఎం రేవంత్‌రెడ్డి వివ రించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికే 75 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వోల్లం మల్లేశం, తుమ్మ గంగాధర్, బుర్ర ప్రవీణ్ గౌడ్, నాదేపు శంకర్, ఎల్ల రాజన్న, దయాల మల్లారెడ్డి, చింతల గంగాధర్, పట్నం అనురాధ, గంగిపెల్లి వేణు, నీలి ప్రతాప్, హరీష్, గంగాధర్, భూమేష్ ఉన్నారు.

'పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు'



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

కోరుట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ బీఎస్ లత మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని సాయిరాంపుర, బిలాల్‌పుర, అయ్యప్ప గుట్ట, ఎఖీన్‌పూర్‌లో పారిశుధ్య పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. మురికి కాలువల్లో చెత్త చెదారం నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లు కుదించిన పాపం బీఆర్ఎస్‌దే'



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి కుదించిన పాపం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శించారు. బీసీల మీద బీజేపీ నాయకులకు ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రిజర్వేషన్లను షెడ్యూల్9లో చేర్చమ నాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. సామాజిక వెనకబాటుతనానికి గురి అవుతున్న వర్గాలనిను వారి జనాభాకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా నిర్ధారించాలని అన్నారు. న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా షెడ్యూల్ 9లో చేర్చాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత విస్మరించిందని విమర్శించారు. సామాజిక న్యాయం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, మాజీ ఎంపీపీ జున్ను రాజేందర్, కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, చందా రాధాకిషన్, పిప్పరి అనిత, రఘువీర్ గౌడ్ పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు'

మెట్‌పల్లిటౌన్, జూలై16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఉప వైద్యాధికారి ఆకుల శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు డయాగ్నోస్టిక్ సెంటర్లను, ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని మనుజ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను, ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టారు.

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా, అర్హత లేకుండా రోగులకు రక్త పరీక్షలు చేయడంతో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సీజ్ చేసినట్లు మెట్‌పల్లి ఉప వైద్యాధికారి ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు, అర్హతలు లేకుండా రక్త పరీక్షలు చేసినా, ఆసుపత్రులు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మల్యాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని నూకపల్లి మాజీ ఉపసర్పంచ్ నులుగొండ సురేశ్, మాజీ వార్డు సభ్యుడు బీనవేని రమేశ్‌తో పాటు మరో ముప్పై మంది బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సత్యం వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, దొంగ ఆనందరెడ్డి, శనిగారపు తిరుపతి, మ్యాక లక్ష్మన్, మిల్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం'

గొల్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని మహిళా సాధికారత బృందం సభ్యులు పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం అగ్గిమల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత బృందం సభ్యులు నిర్వహిస్తున్న బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంకురం కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత బృందం సభ్యులు మాట్లాడుతూ లింగ సమానత్వం గూర్చి, లింగ వివక్షతన గూర్చి, మగ పిల్లలకు లింగ సమానత్వం యొక్క ప్రాముఖ్యత గూర్చి వివరించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, మానసిక ఆరోగ్యం, చదువులో అధిక ఒత్తిడిని ఎలా జయించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. పురుషులకు దీటుగా రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమని ఈ సంద ర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయులు సునీత, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం జెండర్ స్పెషలిస్టు స్వప్న, బోయపోతు గౌతమి, సఖి కేంద్రం బృందం సభ్యులు శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ప్రమాదవశాత్తు పడి యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ డోర్ వద్ద కూర్చున్న మంచిర్యాలజిల్లా జైపూర్ మండలం కిష్టాపూర్‌గ్రామానికి చెందిన మాదాసు తరుణ్ (23) అనే వ్యక్తి ఓదెల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ చివర ఆకస్మాత్తుగా రైలునుంచి కిందపడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో 108అంబులెన్స్ ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కొడుకు మృతిపై బెంగతో తండ్రి బలవన్మరణం

ముత్తారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మారం రాజిరెడి (55) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బుధవారం మృతిచెందాడు. ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజిరెడ్డి కొడుకు గత సంవత్సరం మృతిచెందాడు. కొడుకుమృతిని తట్టుకోలేక రాజిరెడ్డి తరచూ బాధపడుతుండేవాడు. ఈక్రమంలో మనస్థాపానికి గురై మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య పద్మ వెంటనే రాజి రెడ్డిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు రాజి రెడ్డి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువులకు కరువైన బీమా



నష్టపోతున్న రైతులు

చొప్పదండి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలకు బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. విద్యుత్ ప్రమాదంలో, ఇతర అనేక సందర్భాల్లో పశువులు మృత్యువాత పడుతున్న సందర్భంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పశువులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా కల్పించగా ప్రస్తుతం ఎలాంటి బీమా అందడం లేదు. పశుపోషకులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019లో పశువులకు బీమా సౌకర్యం కల్పించింది. ప్రీమియం సొమ్ములో రాష్ట్ర ప్రభుత్వం 80శాతం, రైతులు 20శాతం తమ వాటాగా బీమా సంస్థలకు చెల్లించేవారు.



ప్రమాదవశాత్తు పశువులు చనిపోతే బీమా సంస్థల ద్వారా రైతులు ప్రతి పశువుకు 60వేల రూపాయల వరకు బీమా పరిహారం పొందేవారు. ఐదేళ్లుగా బీమా సౌకర్యం ఎత్తివేయడంతో రైతులు నష్టపోతున్నారు. కేవలం బ్యాంకురుణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కొనుగోలు చేసిన పశువులకు మాత్రమే బీమా చేస్తున్నారు. బ్యాంకర్ల ఒత్తిడితోనే బీమా సంస్థలు ముందుకు వచ్చి పశువులకు బీమా చేస్తున్నాయి. రైతులు వ్యక్తిగతంగా తమ ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు బీమా చేయించుకునే అవకాశం ఉన్నప్పటికీ అవగాహన కరువైంది. బీమా సంస్థలు సైతం ముందుకు రాక పశుపోషకులు నష్ట పోవాల్సి వస్తోంది. చొప్పదండి మండలంలో 7000 వరకు పశువులు ఉండగా, 45నుంచి 50 వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటికి ఎలాంటి బీమా లేకపోవడంతో రైతులకు ధీమా లేకుండా పోయింది. పశువులు మృత్యువాత పడుతున్న సందర్భంలో రైతులకు ఎలాంటి పరిహారం అందడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పశువులకు బీమా సౌకర్యం కల్పించి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉందని పశుపోషకులు కోరుతున్నారు.

పదిర శివారులో చిరుతపులి పాదముద్రలు

● ఆందోళనలో ప్రజలు

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల కిందట ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి శివారులో చిరుతపులి సంచారం మరవక ముందే పదిర సమీపంలో మానేరు వాగు పరిసర వ్యవసాయ పొలాల్లో పాదముద్రల ఆనవాళ్లను బుధవారం రైతులు గుర్తించారు. శ్రీనివాస్ రైతు పొలంలో చిరుత పాదముద్రలు కనిపించడం వల్ల రెండు రోజుల క్రితం రాగట్లపల్లి, పదిర గ్రామాల్లో సంచారించి ఉంటుందా..? లేక ఈ ప్రాంతంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకుందా..? అనే భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చేరుకుని పరిశీలించారు. అవి రెండు రోజుల కిందట సంచరించిన చిరుతపులి పాదముద్రలేనని నిర్ధారించారు. రైతులు, ప్రజలు చీకటి సమయంలో పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. పశువులను ఇంటి సమీపంలో కట్టేయాలని పేర్కొన్నారు. చిరుతపులి కోసం గాలింపు ముమ్మరం చేశామని అటవీశాఖ అధికారులు వివరించారు.

రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఏడీఎమ్

జమ్మికుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను బుధవారం అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్(ఏడీఎమ్) గుప్తా సందర్శించారు. రైల్వేస్టేషన్ ఆవరణ, కొత్తపల్లివైపు మూడవలైన్‌పై ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి లేకపోవడం, తదితరఅంశాలను ఆయన గుర్తించారు. బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఎక్స్‌ప్రెస్‌రైళ్ల హాల్టింగ్, రిజర్వేషన్ బుకింగ్‌కౌంటర్ పెంచుట, లిఫ్ట్‌ఏర్పాటు, మూడవలైన్‌పై ఎఫ్‌ఓబీ నిర్మాణంచేపట్టే విషయమై ఆయనకు వినతిపత్రం అందజేశారు. బీజేపీనాయకులతో కలిసి ఏడీఎమ్ స్వయంగా సమస్యలను పరిశీలించారు. వాటిపై నివేదికరూపంలో ఉన్నతాధికారులకు అందజేసి, త్వరలోనే సమస్యలు పరిష్కస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎరబెల్లిసంపత్ రావు, కొలగాని రాజు, ఆకులరాజేందర్, జీడి మల్లేష్, సంపెల్లి సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతోపాటు ఇంటిలో చిన్నపాటి గొడవ వల్ల మనస్థాపం చెందిన రైతు వరుస దేవనందం పురుగుల మందు తాగాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు, బంధువుల కథనం మేరకు.. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో జరిగిన గొడవ, మోకాళ్ల నొప్పులు అధికమవడంతో మనస్థాపానికి గురైన దేవనందం మంగళవారం రాత్రి తనపొలం వద్ద పురుగుల మందు తాగాడు. చీకటి పడినా దేవనందం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో కనిపించాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని బంధువులు, స్థానికులు, పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

గంజాయి రవాణా చేస్తున్న దంపతుల అరెస్టు



పోలీసుల అదుపులో దంపతులు

బోయినిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన వేముల శ్రీనివాస్, వేముల విజయలక్ష్మి దంపతులు మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి యువతకు విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. భార్యభర్తలిద్దరూ గంజాయి తీసుకొని కోరెం గ్రామానికి వస్తున్నారనే పక్కాసమాచారంతో ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దంపతులను తనిఖీచేయగా, వారివద్ద 250 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. దీంతో దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ కోతలపై రోడ్డెక్కిన రైతులు

● అధికారుల హామీతో ఆందోళన విరమణ



రైతులను సముదాయిస్తున్న సెస్ ఏఈ

గంభీరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. కరెంటుకోతలపై మండిపడ్డారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బైఠాయించారు. దుక్కిమందు బస్తాలతో సిద్దిపేట-కామారెడ్డి ప్రధానరహదారిపై గంటల తరబడి రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయంతో పంటల సాగు అగమ్యగోచరంగా తయారవుతోందని మండిపడ్డారు. పంటలకు ఇస్తామన్న 18గంటల కరంటు ఏమైందని ప్రశ్నించారు. లో వోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని వాపోయారు. వరినాట్ల సమయంలోనే కరెంటుకోతలు ఉంటే మున్ముందు పరిస్థితి ఏంటి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి, రాస్తారోకోలో పాల్గొన్నారు. రైతుల ఆందోళనలతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను శాంతించే ప్రయత్నం చేశారు. అయితే సెస్ ఏఈ రావాలంటూ రైతులు పట్టుబట్టారు. సెస్ ఏఈ వచ్చి సమాధానం చెప్పేవరకు కదిలేది లేదంటూ బీష్మించుకు కూర్చున్నారు. దీంతో సెస్ ఏఈ ఆందోళన వద్దకు వచ్చి రైతులకు నచ్చచెప్పారు. సాధ్యమైనంత త్వరగా విద్యుత్‌సమస్య తీర్చాలని లేనిపక్షంలో సెస్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించి రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కమలాకర్‌రెడ్డి తదితరులు రైతులు ఉన్నారు.

ఎమ్మెస్సార్ సతీమణి మృతి

● ప్రముఖుల సంతాపం



మేనేని సుగుణ(ఫైల్)

కరీంనగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు దివంగత ఎం సత్యనారాయణరావు(ఎమ్మెస్సార్) సతీమణి మేనేని సుగుణ(85) అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నివాసంలో మరణించారు. 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో తనసతీమణి మేనేని సుగుణ పాత్ర ఎంతోఉందని, ఆవిడ సహకారంతోనే రాజకీయరంగంలో రాజకీయాల్లో రాణించాని ఎమ్మెస్సార్ పలు ఇంటర్వ్యూల్లో చెబుతుండేవారు. ఆమెఅంత్యక్రియలను హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించనున్నట్లు ఆమె మను మడు, టీపీసీసీ రాష్ట్రఅధికారి ప్రతినిధి మేనేని రోహిత్‌రావు తెలిపారు.

ప్రముఖుల సంతాపం ..

ఎమ్మెస్సార్ సతీమణి సుగుణ మృతికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

కరీంనగర్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్ నగర్‌కు చెందిన రుద్రారం లక్ష్మయ్య(70) బుధవారం ఉదయం 8:30 గంటలకు ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఆయన గతంలో నుంచి మందులు వాడుతున్నారు. త్రీటౌన్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా వెతికి ఐదు గంటల్లోనే లక్ష్మయ్యను గుర్తించి కుటుంబానికి అప్పగించారు. పోలీస్ సిబ్బంది సాయినేత్ర, ప్రశాంత్‌ను సీఐ జాన్‌రెడ్డి అభినందించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్

● లారీ ఢీకొని ఒకరి మృతి, మరొకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొనడంతో వ్యక్తి కిందపడిపోగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని మృతిచెందిన ఘటన పెద్దపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన సింగరేణి ఉద్యోగి గాండ్ల సత్యం(53) తనకూతురు లావణ్యతో ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వెళ్తున్నాడు. అప్పన్నపేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో వాహనం నడుపుతున్న సత్యం రహదారికి అవతలవైపు పడిపోవడంతో గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతనివెంట వస్తున్న కూతురు లావణ్యకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సత్యం స్వగ్రామం ఓదెల కాగా ఉద్యోగరిత్యా మందమర్రిలో ఉంటున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఓదెలలో వెంటాడుతున్న విషాదాలు

ఓదెల: హత్యలు, ప్రమాదాల పరంపరతో ఓదెలలో విషాదం నెలకొంది. బుధవారం అప్పన్నపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓదెలకు చెందిన గాండ్ల సత్యం అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కూతురు లావణ్యకు గాయాలయ్యాయి. సతీష్ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ బొగ్గుగనిపై విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే 15ఏళ్ల క్రితం సతీష్ సోదరుడు గాండ్ల రాజేశం శబరిమలైకి వెళ్లిన సమయంలో పంబా నదిలో స్నానం కోసం దూకడంతో తీవ్ర ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆ ఘటన జరిగిన కొద్ది రోజులకు రాజేశం భార్య రాజేశ్వరి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఒకేకుటుంబంలో ముగ్గురు మృతి చెందడం విషాదాన్ని నింపింది. అలాగే పొట్టకూటి కోసం బెల్లంపల్లికి వెళ్లి పదిరోజుల క్రితం లారీ ఢీకొనడంతో ఇదేగ్రామానికి చెందిన ఐలు మల్లేష్ మృతిచెందాడు. తాజాగా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లిలో ఓదెలకు చెందిన మోటం మల్లేశం హత్యకు గురయ్యాడు. దీంతో బుడగజంగాల కాలనీలో భయాందో ళనలు నెలకొన్నాయి.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి నారాయణ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన కూనారం సునీల్ 2022 జూన్ 13న పల్లికొండ రోహిత్, ప్రవీణ్ అనే ఇద్దరు స్నేహితులతో కలిసి ధర్మపురి మండలం దోనూరు గ్రామానికి వచ్చారు. పని ముగిం చుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో రోహిత్ అతిగా మద్యం సేవించి వాహనం నడపడంతో దోనూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. బైక్ మధ్యలో కూర్చున్న సునీల్ అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచన్న ఫిర్యాదు మేరకు అప్పటి ధర్మపురి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు శ్రీధర్, రాజు, కిరణ్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువుకావడంతో ముద్దాయి రోహిత్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయి రోహిత్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేక పోవడంతో లైసెన్స్ లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన వాహన యజమాని పల్లికొండ మల్లేశంకు రూ.2 వేల జరిమానా విధించారు.

సీసీ కెమెరాల దొంగలను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఇల్లందకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన సీసీ కెమెరాల దొంగతనాన్ని 48గంటల్లోనే పోలీసులు చేధించారు. జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల14న ఇల్లందకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మూడు కరెంటు ఫీజులు, మూడు సీసీకెమెరాలను దొంగలించారని పాఠశాల హెచ్ఎం ఫిర్యాదుచేశారు. ఫిర్యాదుమేరకు ఎస్ఐ క్రాంతికుమార్, ఏఎస్ఐ సదయ్య, కానిస్టేబుళ్లు రాజబాబు, అశోక్ దొంగతనాన్ని అన్నికోణాల్లో పరిశీలించారు. ఇల్లందకుంట గ్రామానికిచెందిన పదోతరగతి చదువుతున్న ముగ్గురుజువైనల్స్ ఈనెల11న రాత్రి ఈదొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వారివద్దనుంచి మూడుఫీజులు, మూడు సీసీకెమెరాలను స్వాధీనం చేసుకొని కోర్ట్ ముందు హాజరు పరిచామన్నారు. త్వరగా కేసును చేధించిన ఎస్ఐ క్రాంతి కుమార్, ఏఎస్ఐ సదయ్య, కానిస్టేబుళ్లు రాజాబాబు, అశోక్‌ను సీఐ లక్ష్మీనారాయణ అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీ షాపు దగ్ధం

రామడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కావడంతో లాండ్రీ షాపు దగ్ధమయింది. గ్రామానికి చెందిన పాలమాకుల అంజయ్య కొన్నేళ్లుగా లాండ్రీషాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం షాపు బంద్ చేసుకొని ఇంటికి వెళ్లగా అనూహ్యంగా విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో దాదాపు అందులో ఉన్న 100డ్రెస్సులతోపాటు టేలా దగ్ధమయింది. సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంజయ్య తెలిపారు. పేదవాడైన అంజయ్యను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



దగ్ధమైన లాండ్రీ షాపు, బట్టలు

గూడు చెదిరింది..

కోల్‌సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని త్రివేణి కాంప్లెక్స్ సమీపంలోని రహదారి పక్కనేఉన్న ఒకపెద్ద చింతచెట్టు ఉంది. ఈ చెట్టుపై వందలాది కొంగలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఈ చెట్టు రహదారిని కమ్మేసినట్టు ఉండడంతో భారీవాహనాలు వచ్చినప్పుడు ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. చెట్టుపై ఉన్న కొంగలు రెట్టలు వేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడు తున్నారు. వర్షాలు కురిసినప్పుడు భరించలేని వాసన వస్తోంది. దీంతో స్థానికులు చెట్టును తొలగించాలని నగరపాలక సంస్థలో పలుసార్లు ఫిర్యాదు చేశారు. బుధవారం కార్పొరేషన్ సిబ్బంది చింత చెట్టును కొట్టివేశారు. దీంతో కొంగల గూళ్లు దెబ్బతిన్నాయి. చెట్టుపైఉన్న కొంగలు భయపడి ఎగిరిపోయాయి. సాయంత్రం చెట్ల మండలను కార్పొరేషన్ సిబ్బంది రోడ్డుపక్కన వేసి వెళ్లిపో యారు. అప్పటివరకు అటూఇటూ తిరిగిన కొంగలు కాస్త సద్దుమణగగానే అదే చెట్టు వద్దకు వచ్చాయి. తలదాచుకునేందుకు చోటులేక కొట్టేసిన చింతచెట్టు కొమ్మలపైనే బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాయి. తమగూడు ఎక్కడుందంటూ వెతుక్కున్నాయి. కొంగలతో ఇబ్బందిపడుతున్నామని అనుకున్నవారే వాటిపరిస్థితిని చూసి బాధపడ్డారు.



తొలగించిన చింతచెట్టు కొమ్మలపై వాలిన కొంగలు

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సు డ్రైవర్‌పై దురుసుగా ప్రవర్తించిన మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన వంగరి రాజుపై బుధవారం రాత్రి కేసునమోదు చేసినట్లు ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల మేరకు కొడిమ్యాల నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సును నాచుపల్లి గ్రామంలో వంగరి రాజు ఆపి డ్రైవర్‌మొగిలి రవిపై దాడి చేశాడన్నారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు కేసుమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నమనేని తిరుపతి రావు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి మంలంలోని వివిధ పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీపీఎఫ్ డబ్బులు వారిఖాతాల్లో జమచేసే తేదీ వరకు వడ్డీ చెల్లించాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీని అమలు చేయాలని, ఏరియర్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సత్యం, కుమార్, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు శాంతిరాజ్, ప్రధానకార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు

శిలలపై శిల్పాలు చెక్కినారు..!



మల్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం గ్రామ శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్ పక్కన ఎర్రాకుల రామస్వామి గుట్టపై వెలిసిన శ్రీరాముడి ఆలయం వద్ద పెద్ద బండరాళ్లపై వందల ఏళ్ల క్రితమే దేవుళ్ల విగ్రహాలను చెక్కారు. అవి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వేల సంవత్సరాల క్రితం మునులు తపస్సు చేసుకోవడానికి ఈ గుట్టను ఎంచుకొని దేవుడిని కొలవడం కోసం వారు తపస్సు చేస్తున్న ప్రాంతంలో హనుమాన్, మహావిష్ణువు తదితర ప్రతిమలు పెద్ద బండరాళ్లపై చెక్కినట్లు పూర్వీకులు చెబుతారు. వీటితో పాటు ఆళ్వారులు, గరుడి ప్రతిమలు ఉండడంతో ఇది పురాతన ఆలయానికి గుర్తుగా భావిస్తున్నారు. గుట్ట కింద, మధ్యలో పైన ఈ శిల్పాలు కనిపిస్తుంటాయి. వీటి వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ క్షేత్రం నిరాదరణకు గురి కాగా కొన్నేళ్లుగా ఈ ఆలయం వద్ద ఏటా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు గోదారంగనాయకుల కల్యాణం తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి శ్రీపెరంబూదూరు కిరణ్ తెలిపారు.





ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో అమ్మోనియా లీకేజీ

● ప్లాంట్ షట్‌డౌన్ ● తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాలకు యూరియా సరఫరాకు ఆటంకం

కోల్‌సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో బుధవారం సాయంత్రం అమ్మోనియా మెయిన్ ప్లాంట్‌లో అమ్మోనియా గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. దీంతో ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారు. అమ్మోనియా ప్లాంట్‌లోని ఎల్‌బో పైప్‌లైన్‌లో వెల్డింగ్ ఊడిపోయి ఈ లీకేజీ జరిగినట్టు తెలుస్తున్నది. ఫీల్డ్ తనిఖీ చేస్తున్న ఉద్యోగులు పరిస్థితిని గమనించి వెంటనే సమాచారం ఇవ్వడంతో ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. తిరిగి ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టాలంటే 15రోజులు సమయం పట్టనున్నది.



రోజుకు 3,850టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ పరిశ్రమ నుంచి తెలంగాణ తో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కర్ణాటక రాష్ట్రాలకు యూరియా సరఫరా జరుగుతుంది. పరిశ్రమ షట్‌డౌన్ కావడంతో యూరియా సరఫరా నిలిచిపోయింది. తెలంగాణలో యూరియా కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంతో సర ఫరాకు ఆటంకం కలుగనున్నది. జూలైలో తెలంగాణకు 30వేల టన్నులు సరఫరా కావాల్సి ఉండా 16వ తేదీ నాటికి 14,800టన్నులు సరఫరా జరిగింది. గత ఏడాది జూలైలో 60వేల టన్నులు ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు ఇవ్వగా, ఈసారి కోటాను 30 వేల టన్నులకే కుదించారు. ఖరీఫ్ సీజన్‌లో నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో యూరియా అవస రాల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఎఫ్ సీఎల్ నుంచి యూరియా కోటా పెంచాలని కేంద్ర ప్రభుత్వం వద్ద ఒత్తిడి చేస్తూ వస్తుంది. 30వేలతో పాటు అదనంగా మరో 10వేల టన్నులు అయినా లభిస్తుందని ఆశించిన పరిస్థితుల్లో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ప్లాంట్ తిరిగి ఉత్పత్తి దశలోకి రావాలంటే మరో 15రోజులు పట్టే అవకాశం ఉంది.



మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం..



● ఫేక్ కాల్స్ చేసి మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

● భయపెట్టి డబ్బులు లాగుతున్న అక్రమార్కులు

కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి పోలీస్ ఆఫీసర్ డీపీతో ఉన్న నంబర్ నుంచి వాట్సప్ కాల్ వచ్చింది. పోలీస్ ఆఫీసర్ ఫొటో చూసేసరికి అతడు భయపడుతూనే ఫోన్ లిఫ్ట్ చేశాడు. మీ పేరు మీద ఓ పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని, మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని అవతలి వ్యక్తి భయపెట్టాడు. దీంతో భయపడిపోయిన ఆయన తనకేం తెలియదని చెప్పినా వినిపించుకోలేదు. చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండాలంటే పది లక్షలు తాము చెప్పిన ఖాతాలో వేయాలని చెప్పాడు. దీంతో ఆయన ఎలాగోలా కష్టపడి ఆ సొమ్మును అతడు చెప్పిన ఖాతాలో వేశాడు. రెండు రోజు తర్వాత తాను మోస పోయానేమోనని పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే ఆ డబ్బులు వేరే ఖాతాకు వెళ్ల పోయాయి.. ఇలాంటి సంఘటనలు ఇటీవల ఎక్కువగా జరుగుతున్నాయి.



కరీంనగర్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):మీఖాతాలోకి విదేశీ డబ్బులు అక్రమంగా ట్రాన్స్‌ఫర్ అయ్యాయని, కొడుకు కిడ్నాప్ అయ్యాడని, మీ సిమ్ కార్డు పై ట్రాయ్ కేసు నమోదైందని, పిల్లలపై కేసులు నమోదయ్యాయని కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు సైబర్ నేరగాళ్ల భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఈ కేసుల్లో డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ వాట్సప్‌కాల్ చేస్తున్న వ్యక్తి పోలీస్ యూనిఫాంలో కనపడుతుంటాడు. ఇవన్ని సైబర్ నేరగాళ్ల డబ్బులు కొల్లగొట్టేందుకు పన్నిన కుట్రలు.

డిజిటల్ అరెస్టు అనేదే లేదు..

నిజంగానే నేరాలకు పాల్పడిన నేర ఘటనల్లో ప్రమేయం ఉన్న సందర్భాల్లో ఆ వ్యక్తులకు పోలీసులు నేరుగా ఇంటికి వచ్చి నోటీసులు జారీ చేస్తారు.. లేదా అరెస్టు చేస్తారు. పోలీసులు, సీబీఐ, ఏసీబీ, సీఐడీ అధికారులు డిజిటల్ అరెస్టులు చేయరు. డిజిటల్ అరెస్టు అనేది సైబర్ నేరగాళ్ల వారి అమాయకులను దోచుకోవడం కోసం పుట్టించిన కొత్త పదం. ప్రజలు ఏ నేరం చేయనప్పుడు ఎవరికి కూడా భయపడాల్సిన అవసరం లేదనేది మొదట గుర్తించాలి.

1930కు ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరగాళ్లు ఇటువంటి డిజిటల్ అరెస్టు వంటి బెదిరింపుకాల్స్ చేసిన సమయంలో నేరుగా ప్రజలు 1930కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం, ఫిర్యాదు చేయాలి.

అయితే డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు చాలా మంది భయపడి డబ్బులు సమర్పించకుంటున్నారు. విద్యావంతులే ఇటువంటి సైబర్ నేరగాళ్ల వలకు ఎక్కువగా చిక్కుకుంటున్నారు. కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో సైబర్ క్రైం పోలీసులు ప్రతి రోజు పోలీసు స్టేషన్ల పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జూలై నెలలో 15వ తేదీ వరకు కమిషనరేట్ వ్యాప్తంగా సైబర్ నేరాలపై 65 అవగాహన సదస్సులు నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా డిజిటల్ అరెస్ట్ అంటూ ఫోన్లు చేస్తే భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. బెట్టింగ్ యాప్‌లను, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఏపీకే లింకులను క్లిక్ చేయవద్దు. తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, సీవీవీ నంబర్లు ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు.

ఎన్టీపీసీ సీఎండీ గుర్‌దీప్ సింగ్ పదవీకాలం పొడిగింపు

ఏడాది పెంచుతూ ఉత్తర్వులు



జ్యోతినగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్‌దీప్ సింగ్ పదవీ కాలాన్ని ఏడాది పొడిగించారు. ఈ మేరకు అపాయ్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్(ఏసిసి) బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఈ నెల 31తో ప్రస్తుతం సీఎండీగా పనిచేస్తున్న గుర్‌దీప్ సింగ్ పదవీ కాలం ముగియాల్సి ఉంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ సీఎండీ పదవీకాలాన్ని ఏడాది పాటు పొడిగించాలని ఇటీవల ఏసీసీకి ప్రతిపాదనలు పంపించింది. దీంతో ఏసీసీ గుర్‌దీప్ సింగ్ పదవీకాలం పొడి గింపు ప్రతిపాదనకు అంగీకరిస్తూ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్ దారక్ ఉత్తర్వులు విడుదల చేశారు. 01-08-2025 31-07-2026 వరకు గుర్‌దీప్‌సింగ్ సీఎండీగా కొనసాగనున్నారు. ఈయన 2014లో నియమితులయ్యారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 1.59 కోట్లు

● 279 గ్రాముల బంగారం, 14.70 కిలోల వెండి

వేములవాడ కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి 9 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య హుండీలను లెక్కించారు. రాజన్న ఆలయ 9 రోజుల హుండీలు లెక్కించగా కోటి 59 లక్షల 52 వేల 901 నగదు, 279 గ్రాముల బంగారం, 14 కిలోల 700 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. హుండీల లెక్కింపును ఆలయ ఈవో రాధాబాయి పరిశీలించారు. ఈ లెక్కింపులో ఏసీ కార్యలయ పరిశీలకులు సత్యనారాయణ ఆలయ ఏఈవోలు, సూపరిండెంట్‌లు, ఆలయ ఉద్యోగులు శివరామకృష్ణ భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక లోడింగ్

లారీ డ్రైవర్ల నిరసన

ముత్తారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని తాడిచెర్ల బ్లాక్ టూ ఇసుక క్వారీలో నయాదందా మొదలైంది. క్వారీ యజమానులు కంపనీ బండ్ల పేరుతో బండికి సుమారు రూ.6000 రూపాయలు తీసుకొని లైన్ లేకుండా దొడ్డిదారిన లోడు చేసి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. డీడీతో న్యాయపరంగా వచ్చిన లారీలను లోడు చేయకుండా వారంరోజులుగా పడిగాపులు కాపిస్తున్నట్లు లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తిండి తిప్పలు లేకుండా ఉన్న డ్రైవర్లకు క్వారీ యజమానుల నుంచి సరైన సమాధానం రాక లోడ్ చేయకపోవడంతో ఖమ్మం పల్లి ప్రధాన రహదారిపై ఖాళీ వంటసామనుతో గ్యాస్ స్టౌవ్‌తో డ్రైవర్లు బైఠాయించారు. అధికారులు క్వారీలపై నిఘా ఏర్పాటుచేసి సక్రమంగా నడిపించాలని వారు కోరుతున్నారు.

త్వరలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ

● తెలంగాణను దోచుకున్న కేసీఆర్‌ను పాతాళంలోకి తొక్కింది కాంగ్రెస్ కార్యకర్తలే ● ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్

కరీంనగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో నామినేటెడ్, పార్టీ పదవులను భర్తీ చేసి అందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ అన్నారు. కాంగ్రెస్ సంస్థాగత పునర్నిర్మాణం సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కార్యకర్తల కష్టార్జితంతోనే తమకు పదవులు వచ్చాయని, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. త్వరలో ఏర్పాటు చేయబోనే జిల్లా కార్యవర్గంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక జిల్లా ఉపాధ్యక్షుడిని నియమించాలన్నారు.

జిల్లా మొత్తంగా ఒక ట్రెజరర్ ఉండాలని, ఒక అధికార ప్రతినిధి, ప్రతి బ్లాక్ నుంచి ఒక ప్రధాన కార్యదర్శిని నియమించాలన్నారు. ప్రతి మండలం నుంచి ఒక కార్యదర్శిని ఎంపిక చేయాలన్నారు. సమన్వయ కర్తలు ఇచ్చిన జాబితాలు తన వద్ద ఉన్నాయన్నారు. నమ్మిన తెలంగాణను నిండాముంచిన కేసీఆర్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు పాతాళలోకి తొక్కారన్నారు. సమావేశంలో ఎమెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నాయిని రాజేందర్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యేలు కటకం మృత్యుం జయం, ఆరేపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు రుద్ర సంతోష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్‌హుస్సేన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, నాయకులు వైద్యుల అంజన్ కుమార్, వెలిచాల రాజేందర్‌రావు, వొడితల ప్రణవ్ బాబు, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఎండీ తాజ్, ముత్యం శంకర్, కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రావణ్‌నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్, పాల్గొన్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, నాయకులు

పార్టీని నమ్ముకున్నాం.. ప్రాధాన్యం ఇవ్వండి

పార్టీని నమ్ముకున్న తమకు ఇప్పటి వరకు ఎలాంటి పదవులు లేవని, సరైన న్యాయం జరగలేదని రాజన్న సిరిసిల్ల జిల్లా, కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జెండా పట్టుకునేందుకు, సమస్యలపై పోరాటం చేసేం దుకు కష్టంగా ఉన్న సమయంలోనూ కష్టపడి పని చేశామని, అయినా గుర్తింపు లేకపోవడం దారుణమని అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మా ట్లాడుతూ అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీకి బీసీలపై కమిట్‌మెంట్‌లేదు...

బీజేపీకి బీసీల పట్ల కమిట్ మెంట్‌లేదని ఎమ్మెల్సీ అద్దంకి ద యాకర్ విమర్శించారు. ఆయన బుధవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా కూడా ఆర్డినెన్స్‌ను తీసుకురావచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఎదురేలేదని, కేసీఆర్ కుటుంబంలో లుకలుకలు వచ్చాయని, కవిత, హరీశ్‌రావు పార్టీలో ఉంటారో ఉండరో తెలియని పరిస్థితిలున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లపై పోరాటం చేస్తామని, దీనిపై చట్టసభల్లో చర్చ జరగాలన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి నిధులు తేవడంలేదు కాని లేనిపోని పంచాయితీలు పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ కృషితోనే కేంద్ర ప్రభుత్వం జన గణనలో కులగణనను చేర్చిందన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటారా అని విలేకరుల అడిగిన ప్రశ్నకు అద్దంకి దయాకర్ స్పందిస్తూ కాంగ్రెస్‌పార్టీలో ఇప్పటికే నాయకులు, కార్యకర్తలు ఎక్కువగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న, ఎమ్మెల్సీ కవిత గొడవలో ఇద్దరిదీ తప్పే అన్నారు.

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, అర్హులైనవారికి రేషన్‌కార్డులు ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తి స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజ అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రాధాబాయి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయాభివృద్ధికి శంకుస్థాపన చేశారని, అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని, రాజన్న ఆలయ గోశాల నిర్మాణానికి మొన్నటి క్యాబినేట్‌లో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు



● ఉమ్మడి జిల్లాలో 646 ఎంపీటీసీ స్థానాలు
● 60 జడ్పీటీసీ, 60 ఎంపీపీ స్థానాల ఖరారు
● జిల్లాకొక జడ్పీపీటీసీ, మండలానికొక ఎంపీపీ
● విలీనంతో తగ్గిన ఆరు ఎంపీటీసీ స్థానాలు

కరీంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీ టీసీ స్థానాలను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో 646 ఎంపీటీసీ స్థానాలు, 60 జడ్పీ టీసీ స్థానాలను గుర్తించారు. జిల్లాకు ఒక జిల్లా ప్రజా పరి షత్, మండలానికి మండల ప్రజా పరిషత్ ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 5, 773 ఎంపీటీసీ స్థానాలను, 566 జడ్పీటీసీ స్థానాలు, 566 ఎంపీపీ, 31 జడ్పీపీలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది. కరీంనగర్ జిల్లాలో 15 జడ్పీటీసీ స్థానాలు, 15 ఎంపీపీ స్థానాలు, 170 ఎంపీటీసీ స్థానాలను ప్రకటించారు. గతంలో 176 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కరీంనగర్ కార్పొరేషన్‌లో కొన్ని గ్రామాలను విలీనం చేయడంతో ఆరు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి.

- జగిత్యాల జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు, 20 ఎంపీపీ స్థానాలు, 216 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి.
- పెద్దపల్లి జిల్లాలో 13 జడ్పీటీసీ స్థానాలు, 13 ఎంపీపీ స్థానాలు, 137 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాలు, 12 ఎంపీపీ స్థానాలు, 123 ఎంపీటీ స్థానాలను ఖరారు చేశారు. రిజర్వేషన్లను ప్రకటించాల్సి ఉన్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషనువర్తింపజేసేందుకు వీలుగా ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. గవర్నర్ ఆమోదం పొందిన తర్వాతే రిజర్వేషన్లను ప్రకటిస్తారని సమాచారం.

వచ్చే నెలలో తిరుపతికి ప్రత్యేక రైళ్లు

కరీంనగర్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా తిరుపతికి వెళ్లే ప్రత్యేక రైలు ఆగస్టులో అందుబాటులో ఉంటుందని కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2, 9, 16, 23, 30 తేదీల్లో (శనివారాలు) నాందేడ్ నుంచి సాయంత్రం 4.50కి బయల్దేరే ప్రత్యేక రైలు (07015) ఉమ్మడి జిల్లా పరిధిలోని లింగంపేట-జగిత్యాల స్టేషన్‌కు రాత్రి 8.38, కరీంనగర్‌కు 9.38 , పెద్దపల్లికి 10.05, జమ్మికుంటకు 10.38, తిరుపతికి మరుసటి రోజు ఉదయం 11.30కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి ఆగస్టు 3, 10, 17, 24, 31 తేదీల్లో (ఆదివారాలు) ప్రత్యేక రైలు (07016) రాత్రి 7.45కి బయలుదేరి జమ్మికుంటకు మరుసటి రోజు 7.13, పెద్దపల్లి 8.15, కరీంనగర్ 9.08, లింగంపేట-జగిత్యాలకు 9.58, నాందేడ్‌కు సాయంత్రం నాలుగు గంటలకు చేరుకుంటుంది. తిరుపతి వెళ్లే ప్రయాణికులు ఈ రైలు సేవలను వినియోగించుకోవాలని కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ కోరారు.

సర్పంచులను మోసం చేసిన బీఆర్‌ఎస్

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
● లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి భర్తకు పరామర్శ

కరీంనగర్ అర్బన్/గంగాధర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా సర్పంచులను మోసం చేసిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి భర్త రవి గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాక ఆత్మ హత్యకు యత్నించి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పిదాలతో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పను లకు బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆనాడు కేసీఆర్ చేసిన పాపాన్ని మసిపూసి మారేడు కాయ చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దడానికి బీఆర్‌ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారానికి తెరలేపారన్నారు. పెం డింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిన పాపం ఎవరిదో రాష్ట్రంలోని మాజీ సర్పంచులు, ప్రజలకు తెలుసన్నారు. మాజీ సర్పంచులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. విజయలక్ష్మి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఒత్తిడి మేరకు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారని, బిల్లులు చెల్లించకుండా ముఖ్య మంత్రి కేసీఆర్ సర్పంచ్‌లను కష్టాలపాలు చేశాడని ఆరోపించారు. రవికి సొంత ఖర్చులతో మెరుగైన చికిత్సను అందజేస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచులు ఆందోళన చెందవద్దని, పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, కాంగ్రెస్ చొప్పదండి మండల అధ్యక్షుడ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



మాజీ సర్పంచ్ భర్త రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గడ్డి మందు నిషేధించాలి

జిల్లాలో వినియోగిస్తున్న హానికరమైన గడ్డి మందును నిషేధించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్‌లో సూచించారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న సినీ నటి అనుపమపరమేశ్వరన్

కరీంనగర్‌లో వాహిని షాపింగ్ మాల్ ప్రారంభం

కరీంనగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఉస్మాన్‌పురలో వాహిని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. హైదరాబాద్ ఓం ప్రకాశ్ జాజు సారీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ యజమాని వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి వచ్చిన వినియోగదారులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ మీ ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరారు.



చీరలను పరిశీలిస్తున్న అనుపమ పరమేశ్వరన్

కార్యక్రమంలో వేణుభాయ్ జాజు, కమల్ భాయ్ జాజు, వేముల శ్రీనివాస్, విష్ణు, దేవరాజ్, నాగరాజ్, శ్రీకాంత్, మెండే అనిల్ కుమార్, గడ్డం అభిషేక్, కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్ కుమార్, ప్రశాంత్, దీకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సాగునీరు లేక రైతుల పైర్లు ఎండిపోతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదన్నారు. 98 వేల క్యూసెక్కుల నీళ్ల వృథాగా పోతున్నాయని, అందులో 4వ వంతు 22 వేల క్యూసెక్కుల నీళ్ల తీసుకుంటే సరిపోతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరితంగా నీళ్ల ఇవ్వడం లేదన్నారు. సముద్రంలో కలుస్తున్న నీళ్లను తీసుకొచ్చి చెరువులు, కుం టలు నింపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వచ్చాక ఎస్సారెస్పీ కెనాల్‌లో పిల్లలు క్రికెట్ ఆడుతున్నారన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఎస్సారెస్పీ కాలువలో క్రికెట్ ఆడి వినూత్న నిరసన

భగత్‌నగర్: రైతు వ్యతిరేక కాంగ్రెస్ పాలన సాగుతోందంటూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొత్తపల్లి ఎస్సారెస్పీ కాలువలో బుధవారం క్రికెట్ ఆడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల ద్వారా దిగువనున్న జలాలను ఎగువకు మళ్లించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు ఇచ్చే అవకాశం ఉన్నా పంపులను ఆన్ చేయకుండా వృథాగా దిగువకు విడుదల చేస్తున్నారన్నారు.



కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వింత ఆకారంలో బొప్పాయి



గొల్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో లక్ష్మి అనే మహిళా రైతు తోటలో వింత ఆకారంలో బొప్పాయి పండు కాసింది. దీంతో మహిళా రైతు దాన్ని చెట్టు నుంచి కోసింది. అనంతరం తోటలోని బొప్పాయి పండ్లతో పాటు వింత ఆకారంలో ఉన్న బొప్పాయిని విక్రయించింది.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

రాయికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన సామల్ల లక్ష్మీనారాయణ గుండె సమస్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ సేవా సమితి సభ్యులు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సేవా సమితి సభ్యులు మాట్లాడారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

రాయికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు చేసిన పలు నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం గజ్జెల నరేందర్, ఉపాధ్యాయులు లక్ష్మీకాంతం, రమేష్, విజయ్ కుమార్, కిరణ్, యశోద, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, అటెండర్ శేఖర్, స్కావెంజర్ నర్సు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సీడ్స్ పంపిణీ

కథలాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధి లోని 15 ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం అంకాపూర్ కూరగాయల విత్తనాలు, మొక్కలను ఎంఈఓ లోకిని శ్రీనివాస్ అందజేశారు. పాఠశాలల పరిధిలో కిచెన్‌గార్డెన్ విధిగా ఏర్పాటు చేసుకోవాలనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెట్‌లో పేరున్న దేశవాళి అంకాపూర్ విత్తనాలను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. బీర, సోర, బెండ విత్తనాలతో పాటుటమాట, వంకాయ మొక్కలను కొనుగోలు చేసి అందజేశారు. మధ్యాహ్న భోజనంకోసం పాఠశాల ఆవరణలోనే కూరగాయలు పండించి తాజా కూరగాయలతో వంటలు చేసేలా చూడాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు రాజేందర్, గణేశ్ తదితరులు ఉన్నారు.

గోరింటాకు వేడుకలు

మల్లాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో బుధవారం మహిళలు ఆషాడ మాసం గోరింటాకు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని మహిళలు వాసవి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో మహిళలు అంత ఒక్క చోట చేరుకుని ఆషాడ మాసం గోరింటాకు వేడుకలను జరిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి

కోరుట్ల రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి తరగతికి ఉపాధ్యాయుడి కేటాయించాలని తపస్ జిల్లా కార్యదర్శి అందె శివప్రసాద్, మండలశాఖ అధ్యక్షుడు గాడిపల్లి అంజయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలో తపస్ యూనియన్ సభత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తపస్ నాయకులు జుంబర్తి శంకరయ్య, పిస్క రమేష్, మచికట్ల నాగరాజు, నల్ల అనిల్, భూమి అజయ్, నారవేణి వేణు, నాగుల రాహుల్ బాబులు పాల్గొన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు చెల్లించాలి'


ఎంపీడీవో అఫ్జల్‌మియాకు వినతిపత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

బుగ్గారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే ప్రభుత్వం జీతాలు చెల్లించాలని జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు గడ్డం రమేష్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో రమేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి వారం ఉపాధి హామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తుండగా బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు జీతాలు చెల్లించడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించామని రమేష్ తెలిపారు. అనంతరం జీతాలు వెంటనే చెల్లించాలని బుగ్గారం ఎంపీడీవో అఫ్జల్‌మియాకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్ తో పాటు చంద్రశేఖర్, నాగరాజు, గంగయ్య, నరేష్, గణేష్, మంగ పాల్గొన్నారు.

●ధర్మపురి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ ధర్మపురి ఎంపీడీవో రవీందర్‌కు బుధవారం ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వేతనాలతో పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు తదితర వాటికి ఉపయోగించుకునే వారమని పేర్కొన్నారు. ప్రతి వారం ఉపాధి హామీ పథకంపై ఫీల్డు అసిస్టెంట్లు సమీక్షా సమావేశం నిర్వహిస్తుండగా వేతనాలు చెల్లించడం లేదని ఈ రోజు సమావేశాన్ని బహిష్కరించారు. వినతిపత్రాన్ని సమర్పించిన వారిలో ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్ల సంఘం ధర్మపురి మండల అధ్యక్షులు సంపెట మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు గోనపెల్లి మహేష్, రాజేశం, తిరుపతి, శ్రీనివాస్, మహేష్, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

జగిత్యాల అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఇందరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మున్సిపల్ కమిషనర్ స్పందన ప్రొసీడింగ్‌లు అందజేశారు. పట్టణంలోని బీట్ బజార్, బైపాస్ రోడ్, మిషన్ కంపౌండ్, తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అడువాల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో ఎంపికయిన లబ్ధిదారులందరు తమ యొక్క ప్రొసిడింగ్ కాపీలను తీసుకోవాలని కమీషనర్ కోరారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో గ్రామస్థులు అనర్హులకు చోటు కల్పించారని తమ నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, తూతూమంత్రంగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారని పలువురు ఆరోపించారు. మోతె గ్రామంలో నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించలేదని గ్రామస్థుడు నర్ర రాజు ఆరోపిం చారు.

●రాయికల్: రాయికల్ మండలంలో మొత్తం 776 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజురైనట్లు రాయికల్ ఎంపీడీవో చిరంజీవి అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు.

●మండలంలోని తాట్లవాయి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి బాణావతి తిరుమల్, హౌజింగ్ డిపార్ట్‌మెంట్ ఏఈ తిరుమల పాల్గొన్నారు.

●బీర్పూర్: మండలంలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను ఎంపీడీవో భీమేష్, కార్యదర్శులు, కమిటి సభ్యులు అంద జేశారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల తాజ మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

● ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం


సిరికొండలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ సుదర్శనం

కథలాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ సుదర్శనం తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకుంటే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుందన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఇనుప స్టార్టర్లు తొలగించి ఫైబర్ స్టార్టర్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కెపాసిటర్ల ఏర్పాటు వల్ల ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఎలాంటి అంతరాయాలు లేకుండా వ్యవసాయ, గృహ వినియోగ దారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు.

సిరికొండలో జరుగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ సుదర్శనం పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎస్ఈగా నియమితులైన అనంతరం మొదటిసారి కథలాపూర్ రావడంతో అధికారులు, సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈఈ మధుసూదన్, ఆపరేషన్ డీఈఈ రఘుపతి, ఏఈలు దివాకర్‌రావు, భూమేశ్వర్, సబ్ ఇంజినీర్ నవీన్, సిబ్బంది ఉన్నారు.

కుమారుడు ఇంట్లోకి రానివ్వడం లేదు

● ఆర్డీవోకు వృద్ధ దంపతుల ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కుమారుడు ఇంటిలోకి రానివ్వడం లేదని మల్యాల మండల కేంద్రానికి చెందిన కాలికంటి బుచ్చవ్వ పెద్ద సాయిలు దంపతులు బుధవారం జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. పాత ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్న తన చిన్న కుమారుడు శ్రీనివాస్, కోడలు ఇంటి నిర్మాణం పూర్తి అయిన తర్వాత తమను ఇంటిలోకి రానివ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ దంపతులు సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథంలను ఆశ్రయించగా వారు ఆర్డీవో మదుసూదన్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ, బాధ్యత పిల్లలదేనని వారిని విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట సీనియర్ సిటిజన్స్ బాధ్యులు పిసి హన్మంత్ రెడ్డి, వెల్మల ప్రకాశ్ రావు, డిండిగాల విఠల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసహాయం

కోరుట్ల రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగినిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024 - 25 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నిజామాబాదు జిల్లా ఈశ్వర్ ట్రస్ సభ్యులు ఆర్థిక చేయూతను అందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహంను అందించారు. పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థి ఏలేటి అక్షయ 507 మార్కులు సాధించంగా రూ. 5000, 488 మార్కులు సాధించిన విద్యార్థి పల్లికొండ నిఖిల్ రూ. 3000, 483 మార్కులు సాధించిన ఎనుగందుల రక్షితకు రూ. 2000 నగదును అందించి అభినందించారు. అదే విధంగా గ్రామస్థులు పాట్కూరి తిరుపతిరెడ్డి, బద్దం తిరుపతి రెడ్డిలు విద్యార్థులకు రూ. 5000 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరస్థులపై కొరడా..

(5 వ పేజీ తరువాయి)

జైలు శిక్ష ఒకరికి, ఇద్దరికి పది సంవత్సరాల జైలు శిక్ష, ఇరువురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, ఐదుగురికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, మూడు సంవత్సరాల జైలు శిక్ష ఎనిమిది మందికి, రెండు సంవత్సరాల జైలు శిక్ష ఇరువురికి, ఒక సంవత్సరం లోపు జైలు శిక్ష నలుగురికి విధించబడ్డాయి. జిల్లాలో ప్రస్తుత యేడాది వివిధ కేసుల్లో సుమారు 55 మందికి శిక్షలు విధించడం గమనార్హం. ఇందులో హత్య కేసులు, పోక్సో కేసులతో పాటు ఇతర నేరాలకు సంబంధించిన కేసులు సైతం ఉన్నాయి.

● ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకం

నేరస్థులకు శిక్షలు పడేలా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌వో), కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షణ చేస్తూ ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుళ్లకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తారు. నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలం కోర్టుకు సమర్పించడంపై పకడ్బందీగా దృష్టి సారిస్తున్నారు. కోర్టు సమాచారం, ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు, కోర్టు కానిస్టేబుళ్లకు తెలియజేస్తుండడం, కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల యొక్క సూచనలు పాటిస్తుండడంతో నేరస్థులకు కచ్చితమైన శిక్షలు పడటానికి దోహద పడుతున్నాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

నేరస్థులు తప్పించుకోలేరు -అశోక్ కుమార్, ఎస్పీ



సమాజంలో నేరం చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరు. ప్రాసిక్యూషన్ వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తున్నాం. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు స్వీకరించి నప్పటి నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, పకడ్బం దీగా విచారణ జరపడంపై ప్రత్యేక దృష్టి సారించాం. సాక్షాధారాలను సేకరించడం, కోర్టులో ప్రవేశపెట్టడం, నేరస్థులకు శిక్ష పడడానికి కృషి చేస్తున్నాం.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుటకు అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి భోనగిరి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం ప్రవేశపెట్టిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు మొత్తం 28 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ లేకుండా వంద శాతం సబ్సిడీతో రూ.50వేల చొప్పున 20మండలాలకు 20 యూనిట్లు, ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి ఐదు యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 80శాతం సబ్సిడీతో యూనిట్ రూ.లక్ష, 70శాతం సబ్సిడీతో ఒక యూనిట్ రూ.2లక్షలు, 60శాతం సబ్సిడీతో యూనిట్‌కు రూ.3 లక్షల రుణ సదుపాయం ఉందన్నారు. ఈనెల 31వరకు అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దివ్యాంగుల హెల్ప్‌లైన్ నెంబర్ 155326కు సంప్రదించాలన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే దివ్యాంగులకు కనీస దివ్యంగత్వం 40శాతం పైన ఉండాలని, 21నుంచి 55 ఏళ్ల వయస్సు లోబడి ఉండి, ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో 1.5లక్షలకు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షల లోపు ఉం డాలని డీడబ్ల్యూవో నరేష్ కోరారు.

కుక్కల బెడదను నివారిస్తాం

-మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లిటౌన్, జూలై16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. బుధవారం పట్టణంలోని కమిషనర్ ఆదేశాలతో స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 19, 24, 26వ వార్డుల్లో వీధి కుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించినట్లు కమిషనర్ తెలిపారు. కుక్కలకు ఆపరేషన్ చేయించిన తర్వాత వదిలిపెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

మల్యాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మల్యాలలో బుధవారం స్థానిక సంస్థల కార్యశాల నిర్వహించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, బింగి వేణు, జనగాం రాములు, కొల్లూరి గంగాధర్, సంగని రవి, బొట్ల ప్రసాద్, గుండేటి గంగారాం, కెల్లెటి రమేష్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

ఇబ్రహీంపట్నం, జూలై16(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ళ దేవేందర్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల మంజూరు చేస్తున్నదని మాజీ ఎంపీపీ అన్నారు. ఇటీవలే ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బత్తుల శ్రీనివాస్ ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును అందిచటం ఓ నిదర్శనమన్నారు. అభివృద్ధి కోసం సమిష్టిగా ముందుకు వెళ్ళి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని మాజీ ఎంపీపీ సుచించారు.

చెరువులను నీటితో నింపాలి

కొడిమ్యాల, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైసమ్మ, పోతారం చెరువులను ఎల్లంపెల్లి నీటితో నింపి రైతులను ఆదుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంను పూడూర్ మాజీ సర్పంచ్ వెల్మల రాంరెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత్తం వర్షాలకు కురువక పోవటంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చెరువులను నింపటానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సకాలంలో వర్షాలు కురవక పోవటంతో రైతులు విత్తిన మెట్ట పంటలు లేత మొలకలు మొలకెత్తక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వరి నార్లు ముదిరిపోయి నాటుకునె పరిస్థితి చేయిదాటి పోతుందన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యే చొరవ తీసుకొని సంబందిత అధికారులతో మాట్లాడి నియోజకవర్గంలోని కొడిమ్యాల, మల్యాల, బోయినిపల్లి, వేములవాడ, మండలాల రైతులకు సాగు నీటిని తరలించు విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మైసమ్మ చెరువు, పోతారం చెరువులను నింపినట్లయితె రైతులకు పంట నష్టం జరుగదన్నారు. సాగు నీటిని సకాలంలో అందించినట్లయితె కోట్లాది రూపాయల పంటలు నష్టపోకుండా కాపాడబడుతాయన్నారు.

బీసీ రిజర్వేషన్లపై నేడు అభినందన సభ

ధర్మపురి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞత తెలిపే విధంగా ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో ఈ నెల 17 న గురువారం ఉదయం 10 గంటలకు అభినందన సభ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పీఏ సంగి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కావున ధర్మపురి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీసీ సామాజికవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

'సేవా కార్యక్రమాలు విస్తరింపచేయాలి'

కోరుట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరింపచేయాలని క్లబ్ జిల్లా గవర్నర్ చంద్రప్రకాష్ అన్నారు. బుధవారం పట్టణంలోని మార్కండేయ భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జీవన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నల్ల గంగాధర్, గుంటుక సురేష్‌బాబు, అడెపు మధు, అల్లాడి ప్రవీణ్ కుమార్, ఉషాకిరణ్ కుమార్, పోతని ప్రవీణ్, మంచాల జగన్, కుందారపు మహేందర్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర


జగిత్యాలలో బోనాలతో మహిళల ఊరేగింపు

జగిత్యాల క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాలలో బుధవారం బోనాల జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో వీరమ్మ తల్లి బోనాలు, మేరు సంఘం, వాణి నగర్, బీట్ బజార్, బోయవాడ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలు, ఎలుకబావి వాడ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని డీజే, డప్పు చప్పుల్లు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలు వేడుకల్లో పాల్గొని పోచమ్మ, గంగమ్మ, మడేలేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జుంబర్తి శంకర్, రమేష్, మాడిశెట్టి మల్లేశం, గట్ల రమేష్, రాపర్తి గణేష్, నారాయణ. ప్రతాప్, గుమ్మల అంజయ్య తదితరులు ఉన్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో బుధవారం బోనాల పండుగను ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ గంగపుత్ర సంఘం సభ్యులు ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న విధంగా గొలెండ్లతో ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకోని ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఓడి బియ్యం పోసి ప్రత్యేక మొక్కులు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక పట్టణ అధ్యక్షులు పర్రె శంకర్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు మాన్కల చిన్నయ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయంలో, పోచమ్మ ఆలయంలో బుధవారం టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కో-ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ మడేలేశ్వరస్వామి బోనాలు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రజక సంఘానికి చెందిన అనేక మంది మహిళలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం పట్టణ అధ్యక్షులు కొనపర్తి రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొనపర్తి సత్యనారాయణ, కోశాధికారి పోగుల గుండయ్య, కొనపర్తి రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గొల్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లొత్తునూర్ గ్రామంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుట్టపాక సత్తయ్య తల్లి ఇటివల ఆనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు బుధవారం పరామర్శించారు. మండల కేంద్రంలో ప్రముఖ అడ్తి వ్యాపారి ఏనుగు శ్రీనివాస్ రెడ్డి తల్లి ఇటివల మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. మాజీ సర్పంచ్‌లు రాజన్న, రత్నయ్య, మార్కెట్ డైరెక్టర్ కట్ట లక్ష్మణ్ రావు, నాయకులు గాజుల రమాగౌడ్, ఎర్ర సంపత్, కిష్టంపాట రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం, జూలై16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కలిcచాలని కేబినెట్లో తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ బుధవారం మండలంలోని వేములకుర్తి గ్రామ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిసిసి మాజీ సంయుక్త కార్యదర్శి పెంట లింబాద్రి, సేవాదళ్ మండల అధ్యక్షుడు నాంపల్లి వెంకటాద్రి, యామాపూర్ సొసైటీ చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు తరి రామానుజన్, బుర్రి ముత్తన్న, పుప్పాల నగేష్ పాల్గొన్నారు.

'స్వయం ఉపాధితో మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి'


మహిళా సంఘాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవిందర్

కోరుట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి చెందవచ్చునని కమిషనర్ రవిందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని స్వశక్తి మహిళ భవనంలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మహిళ సంఘాల స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన తినుబండారాలు ఇతర సామగ్రి ఉత్పత్తు మేళా నిర్వహించగా వాటిని సందర్శించారు. తడి, పోడి, హానీకర చెత్త వేరు చేసే విధానంపై కాలనీ వాసులకు అవగాహనలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ల్ రాజేంద్రప్రసాద్, ఆశోక్, మెప్మా టిఎంసీ శ్రీరాంగౌడ్, సీఓలు సంధ్య, గంగారాణి, మెప్మా సిబ్బందితో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

●జగిత్యాల అర్బన్: పురపాలక సంఘ వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం జగిత్యాల మున్సిపాలిటీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ప్రోడక్ట్ మేళా నిర్వహించారు. పట్టణంలోని స్వశక్తి సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఈ మేళాలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజలు మేళాకు హాజరై వారికి కావాల్సిన వస్తువులు తిను బండారాలు కొనుగోలు చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్పందన మాట్లాడుతూ పట్టణంలోని మహిళలు ఏర్పాటు చేసిన మేళాకు మంచి స్పందన రావాడం శభ పరిణామం అన్నారు. పట్టణంలోని స్వశక్తి సంఘాల మహిళలు మరిన్ని ఉత్పత్తులను నాణ్యత ప్రమాణాలతో తయారు చేసి మరిన్ని లాభాలు గడించాలని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిఎంసి రజిత, సిఓ రాధ, మరియు రిసోర్స్ పర్సన్‌లను కమీషనర్ అభినందిచారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

కోరుట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని గౌతమ్ మోడల్ స్కూల్ విద్యాసంస్థల డీన్ నరసింహరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ బైనాపురం ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని గౌతమ్ మాడల్‌స్కూల్‌లో మాడల్ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వినియోగించిన ఓట్లను లెక్కించి వారివారి పదవులను ఉపాధ్యాయులు ప్రకటించారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇన్చార్జి ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గోదూర్, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, వేములకుర్తి గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకుని ఎప్పటికప్పుడు బిల్లులు పొం దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హర్షద్, నవీన్, శ్రీకాంత్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలి

ఇబ్రహీంపట్నం, జూలై16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలని మండల విద్యాధికారి బండారి మధు అన్నారు. మండలంలోని వర్షకొండలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివిద్యార్థి మొక్కలు నాటడం ఒక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకొనిపాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ విజయ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.